క్లుప్తంగా

రోడ్డును కమ్మేసిన కంపచెట్లు


జోసఫ్‌పేట రోడ్డు వద్ద ఇలా..

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని జోసెఫ్‌పేట గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గానికి ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. కొన్నినెలల నుంచి ఈ పరిస్థితి ఉంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ముళ్లచెట్లు కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఆటో, మోటార్‌బైక్ ఢీకొని పలువురు గాయపడ్డారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

సోదరి అభిమానం


కాకాణికి రాఖీ కడుతున్న లక్ష్మీకల్యాణి

పొదలకూరు: జైలు నుంచి విడుదలై తాడేపల్లి నివాసంలో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పొదలకూరు బిట్ – 3 ఎంపీటీసీ సభ్యురాలు గంగవరపు లక్ష్మీకల్యాణి రాఖీ కట్టారు. కాకాణి విడుదలయ్యాక రాఖీ పౌర్ణమి జరుపుకొంటానని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయనకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

పక్కాగా సర్వే


శిక్షణలో పాల్గొన్న సర్వేయర్లు

మనుబోలు: స్వామిత్వా సర్వేను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వేయర్లు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా గ్రామాలు, గ్రామ కంఠాల్లో నివాసముంటున్న వారి పేర్లు నమోదు చేసి ప్రాపర్టీ కార్డులు అందజేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో కూడా ఇస్తున్నామని తెలిపారు. సర్వేలో భాగంగా అందజేసే కార్డుల ద్వారా ఇంటికి సంబంధించిన ఆస్తిని తనఖా పెట్టి బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చన్నారు. ఇళ్ల స్థలాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తామని తెలిపారు. సర్వేయర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 29.980 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 29.980 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,200 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం: స్థానిక ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫిట్టర్ కోర్సులో ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బీ మురళీధర్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 99639 50604, 76718 61779, 63005 99477, 99851 69099 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


కిలో పొగాకు సగటు ధర రూ.214

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు సగటు ధర రూ.214.13 పలికినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 174 బేళ్లు రాగా, 67 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.285, కనిష్టంగా రూ.140, సగటున రూ.214.13 ధర పలికిందని వివరించారు.

దివ్యాంగులపై ‘కూటమి’ కక్ష

- పింఛన్లకు కోత
- రీవెరిఫికేషన్ పేరుతో నోటీసులు

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పింఛన్ల రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులపై కక్ష కట్టింది. ఎన్నో సంవత్సరాలుగా పెన్షన్ సొమ్ముపై ఆధారపడి జీవిస్తున్న వారి విషయంలో కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. దివ్యాంగులు కన్నీళ్లు పెట్టుకుంటూ వేడుకుంటున్నా చంద్రబాబు ప్రభుత్వంలో చలనం లేదు.



చిన్నయ్యకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు



రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సదరమ్ సర్టిఫికెట్

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లో దివ్యాంగ పింఛన్లకు భారీగా కోత విధించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ ఎంపీడీఓలకు వినతిపత్రాలను సమర్పిస్తున్నారు. రీవెరిఫికేషన్ పేరుతో ఆయా సచివాలయాలకు జాబితాను పంపి పింఛన్లను తొలగించారు. తిరిగి పొందాలంటే ఎంపీడీఓ లాగిన్ నుంచి సదరమ్‌కు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకు వచ్చి సమర్పించాల్సి ఉంటుంది. వీరికి సెప్టెంబర్‌లో పింఛన్లను నిలిపివేయడం జరుగుతుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలకు సంబంధించి సుమారు 832 మంది దివ్యాంగులకు రీవెరిఫికేషన్ నోటీసులను అందజేయడం జరిగింది.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి మనుబోలుకు చెందిన ఎం.రాగేష్, వయసు 32 సంవత్సరాలు. జన్యుపరమైన లోపం వల్ల 3.7 అడుగులే ఉన్నాడు. సాధారణ ఎత్తు కన్నాన చాలా తక్కువ ఎత్తు, బరువు ఉండటంతో ఏ పని చేయలేకున్నాడు. ఇటీవల వరకూ పింఛన్ వచ్చేది. రీవెరిఫికేషన్‌లో భాగంగా ఇతడికి వికలత్వం 40 శాతం కన్నా తక్కువగా ఉందని చెప్పి పింఛన్ తొలగించారు. అయితే ప్రభుత్వం నిబంధనల ప్రకారం 4.10 అడుగుల కన్నా తక్కువ ఉంటే వారిని మరగుజ్జుగా ప్రకటించాలి. అలాంటిది 3.7 అడుగుల మాత్రమే ఉన్నా అనర్హుడిగా ప్రకటించారు. రాగేష్‌కు తండ్రి లేడు. ప్రస్తుతం తల్లితో ఉంటున్నాడు. వీరి కుటుంబం ప్రస్తుతం పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తోంది.

– మనుబోలు



ఈ ఫొటోలో ఉన్న దివ్యాంగుడి పేరు గొరిపర్తి చిన్నయ్య (42). పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చిన్నతనం నుంచి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. 2011లో 61 శాతం విలకత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక శిబిరంలోనూ శాశ్వత దివ్యాంగ సర్టిఫికెట్‌ను పొందాడు. ఇందుకు సంబంధించి ఐడీ నంబర్ కూడా ఉంది. అయితే వెరిఫికేషన్, అసెస్‌మెంట్ పేరుతో పింఛన్ తొలగించారు. చిన్నయ్య లబోదిబోమంటూ ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించే ప్రయత్నంలో ఉన్నాడు. చిన్నతనం నుంచి పెన్షన్ తీసుకుంటున్నానని ఇప్పుడు తొలగించడం అన్యాయమని వాపోతున్నాడు.

జెడ్పీ హైస్కూల్ స్థల వివాదంపై సర్వే

- జిల్లా సర్వేయర్ రాక


పాఠశాల వద్ద కొలతలు తీస్తున్న జిల్లా సర్వేయర్ నాగశేఖర్, తహసీల్దార్ తదితరులు

పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రాంగణ స్థలంపై కొద్దిరోజులుగా వివాదం నెలకొంది. పాఠశాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానికులతోపాటు హెచ్‌ఎం ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతంలో పలుమార్లు కొలతలు వేయించారు. రమాదేవి జెడ్పీ సీఈఓగా ఉన్నప్పుడు ఆక్రమణలపై సమగ్ర సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులు అందజేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో అప్పటి పంచాయతీ సెక్రటరీ ఏడుగురికి నోటీసులను సైతం ఇచ్చారు. మళ్లీ గురువారం జిల్లా సర్వేయర్ వై.నాగశేఖర్ ఆధ్వర్యంలో స్థలాన్ని సర్వే చేయించారు. చుట్టుపక్కల ప్రాంతాన్ని కూడా సర్వేయర్లు పూర్తి స్థాయిలో కొలతలు తీశారు. సర్వే నంబర్లు 502/ఏ–1 లో 2.78 ఎకరాలు పాఠశాల స్థలం, 502/ఏ–2 లో 7 సెంట్లు ప్రైవేటు వ్యక్తుల స్థలం ఉందని రికార్డులు వెల్లడిస్తున్నట్టు మండల సర్వేయర్ గోపీనాథ్ తెలిపారు. అయితే సర్వేలో ఏ మేరకు పాఠశాల స్థలం ఆక్రమణలకు గురైందో అధికారులు వెల్లడించలేదు. నివేదికను కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ బి.శివకృష్ణయ్య వెల్లడించారు. యాజమాన్య హక్కుల వివాదమైనందున సర్వేను బహిర్గతం చేయరన్నారు. హెచ్‌ఎం శైలజ మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన స్థలం రికార్డులు తమ వద్ద ఉన్నాయని, వాటి ప్రకారం స్థలాన్ని సర్వే కొలతల్లో చూపించాల్సిందిగా పేర్కొన్నారు. జిల్లా సర్వేయర్ తాము సర్వే నిర్వహించే సమయంలో ఇతరులను అనుమతించవద్దని ఉన్నతస్థాయి అధికారులు ఆదేశించారని, అందువల్ల కొలతల సమయంలో ఎవరూ మాట్లాడవద్దన్నారు. స్థానికులు, ప్రైవేట్ వ్యక్తుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకోవడంతో సర్దిచెప్పారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెంచాలి


రామన్నపాలెంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయ్‌కుమార్

కొడవలూరు: వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలని కావలి డివిజనల్ అభివృద్ధి అధికారి(డీఎల్‌డీఓ) విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో చెత్త సేకరణ విధానాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నిష్ప్రయోజనమన్న భావన ప్రజల్లో తొలగించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. తడి, పొడి చెత్త ఇంటి వద్దనే వేరు చేసేలా ప్రజల్లో చైతన్యం తెస్తే చెత్త నుంచి సంపద కేంద్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వెంకటసుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గోవర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు


కాకాణిని కలిసిన నాయకులు

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గురువారం తాడేపల్లి నివాసంలో మండలంలోని ఆ పార్టీ నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పిన్నంరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, బొడ్డు మాల్యాద్రిరెడ్డి కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కాకాణి జైలు నుంచి విడుదలైతే తలనీలాలు సమర్పిస్తానని అశోక్‌కుమార్‌రెడ్డి మొక్కుకున్నారు. ఆ ప్రకారం ఆయన తలనీలాలు సమర్పించారు.


కొబ్బరికాయలు కొట్టిన నాయకులు, కార్యకర్తలు

⇨ ముత్తుకూరు(పొదలకూరు): గోవర్ధన్‌రెడ్డి బాగుండాలని కోరుకుంటూ గురువారం బ్రహ్మదేవం గ్రామ అభయాంజనేయస్వామికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. అన్ని కేసుల్లో తమ నాయకుడు కాకాణి కడిగిన ముత్యంలా బయటపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరపు సుగుణ, అగ్ని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సర్వేపల్లి గ్రామానికి చెందిన తెనాలి శేఖర్ వెంకటాచలం వైపు బైక్‌పై వెళ్తున్నారు. తిక్కవరప్పాడు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్.. బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు తీవ్ర గాయాలవగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. శేఖర్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్సై వీరేంద్రబాబు

తోటపల్లిగూడూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు ఆన్‌లైన్ ద్వారా అనుమతి తప్పనిసరి అని తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ విగ్రహాలను ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా కమిటీ సభ్యులదే బాధ్యత అన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక దృష్టి

- ఏడీఏ శివనాయక్


మాట్లాడుతున్న ఏడీఏ

పొదలకూరు: వీఏఏలు, వీహెచ్‌ఏలు ఈ–క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం పూర్తి చేయాలని పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) కె.శివనాయక్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఐదు మండలాల పరిధిలో ఉన్న వీఏఏలు, వీహెచ్‌ఏలకు ఒకరోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఈ–క్రాప్ బుకింగ్‌పై అవగాహన పెంపొందించి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. వ్యవసాయ పనిముట్లు సర్వే, ఇతర పథకాల గురించి రైతులతో మాట్లాడాల్సిందిగా పేర్కొన్నారు. సహాయ ఉద్యానాధికారి అనూరాధ మాట్లాడుతూ పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. ఆ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు రాయితీలు అందజేయడం జరుగుతుందన్నారు. నీటి సౌకర్యం ఉన్న వారు సాగు చేపడితే నాలుగేళ్లలో మంచి దిగుబడిని సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానాధికారులు ఆనంద్, మైథిలి, ఏఓలు ప్రతాప్, వెంకటకృష్ణయ్య, సోమసుందరం, జ్యోత్స్న, ఏఈఓలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర నాయక్

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను గురువారం డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా సిలబస్ ఎంత మేరకు పూర్తి చేశారు?, ఇటీవల జరిగిన ఎఫ్‌ఏ–1 పరీక్షలు ఎలా రాశారని తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైస్కూళ్లలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతా శాతం సాధించాలన్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తినేలా చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులు పరిశీలించారు. హెచ్‌ఎంలు అమూల్య, వసంతకుమారి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటాచలం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని కసుమూరు గ్రామంలో వ్యవసాయ సాంకతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సహకారంతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు శాస్త్రవేత్తలు వరిలో చీడపీడల నివారణ, రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాల గురించి వివరించారు. వరిలో మేలైన వరి వంగడాలు, ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీశివజ్యోతి, మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి


కాలువలో వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రామ్మోహన్‌రావు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో సరైన నిర్వహణలో లేని వీధి తాగునీటి కుళాయిలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథాను అరికట్టాలని ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గిడ్డంగివీధి, కంశాలివీధి, కుక్కలగుంట, మున్సిపల్ వెహికల్ షెడ్డు పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నాణ్యతను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ కుళాయిలకు మూతలు లేకుండా, డ్యామేజ్ అయి, పగిలిపోయి ఉన్న వాటిని గుర్తించి వెంటనే రిపేర్లు చేపట్టాలని, అవసరమైన చోట్ల నూతన ట్యాప్‌లను బిగించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లోని డ్రెయిన్ కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను గుర్తించి తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

‘రంగడి’కి వెండిపాదాల బహూకరణ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి పకాబత్తుల సుబ్రహ్మణ్యం ఆచారి– ప్రసన్నకుమారి దంపతులు వెండి పాదములను ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి గురువారం అందజేశారు. రూ.87,360 విలువ చేసే 960 గ్రాముల రెండు వెండిపాదములను స్వామివారికి కానుకగా అందజేసినట్లు ఈఓ తెలిపారు.

బాధ్యతాయుతంగా విధులు


సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ

సైదాపురం: ఉపాధి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని నెల్లూరు జిల్లా డ్వామా అడిషనల్ పీడీ స్వరూప్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా నిమ్మ సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, అర్హత కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి కింద పలు పనులు మంజూరు చేశామని, వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్


తోటపల్లిగూడూరు : నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు


తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎస్‌కే మస్తానమ్మ డిమాండ్ చేశారు. వేతనాలు పెంపు, ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ రద్దు చేయాలంటూ గురువారం నరుకూరు సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ పనిభారం పెరిగిపోయిందన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా 2024లో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమల్లోకి రాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మారుబోయిన రాజా, నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ కార్యదర్శి ఆరని గోపి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, అనిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

⇨ మనుబోలు: అంగన్‌వాడీలపై పనిభారం మోపడం సరికాదని సీఐటీయూ నాయకుడు దేవదానం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మనుబోలు మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వ తీరుకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు 2జీ ఫోన్‌లు ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేయాలనడం సరికాదన్నారు. వారు ఫోన్‌లు తిరిగి ఇచ్చేసినా ఇంకా యాప్‌లో డేటాను అప్‌లోడ్ చేయమంటున్నారని తెలిపారు. 5జీ ఫోన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాత్రిపూట బడులు చెప్పాలంటూ ఎంపీడీఓ ఒత్తిడి తెస్తున్నారన్నారు. వేల జీతాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు కూడా వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆదిశేషయ్య, యూనియన్‌కు చెందిన సుగుణమ్మ, శేషమ్మ, రాజేశ్వరి, గౌరి, శోభ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్)ను రద్దు చేయాలని అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్లు నగర పంచాయతీ పరిధిలోని పార్క్‌సెంటర్లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. మానవహారంగా ఏర్పడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్మికల జిల్లా నాయకురాలు ఎల్వీ శేషమ్మ మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్ వల్ల అంగన్‌వాడీ కార్మికుల మీద పనిభారం ఎక్కువైందన్నారు. తమకు ప్రభుత్వం నుంచి అందే అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలని కోరారు. అర్హులైన వారికి గ్రాట్యుటీ అందించాలని, రిటైర్‌మెంట్ అనంతరం పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, జానీబాషా, అంగన్‌వాడీ నేతలు అనిత, స్వర్ణ, సుప్రజ, అనూష, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ నాయకురాలు విజయమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ నార్తురాజుపాళెం కూడలిలో గురువారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పాత మొబైల్ ఫోన్‌లే ఉన్నందున విధులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, కొత్త మొబైల్ ఫోన్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి టి.నరసింహం పాల్గొన్నారు.

⇨ కోవూరు: కోవూరులోని సాయిబాబా గుడి సమీపంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం సాయంత్రం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


కోవూరులో..


మనుబోలు: అంగన్‌వాడీల మానవహారం


కొడవలూరు: నార్తురాజుపాళెంలో..


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పార్క్‌సెంటర్లో..